# ఎర్లీబర్డ్



**కోలపల్లి ఈశ్వర్**

ఆమె అందంగా ఉంటుంది.

ఎంత అందంగా అంటే, చెప్పలేనంత అందంగా ఉంటుంది.

అవును, వర్ణించడం చేతకాని వాళ్లు ఆమె అందం గురించి చెప్పగలిగే మాట అదొక్కటే!

అంత అందమైన ఆమె... ఉపేంద్రని ప్రేమిస్తోందని తెలిసినప్పుడు నిజంగా నాకు మతిపోయినట్టనిపించింది.

అనిపించదా మరి?

ఉపేంద్ర తుమ్మమొద్దులా నల్లగా ఉంటాడు. పైగా, మెల్లకన్ను... చప్పిడి ముక్కు!

అలాంటివాణ్ణి ఆమె ప్రేమించడం ఏమిటి?

రాజేంద్ర నాతో ఆ విషయం చెప్పినప్పుడు నేనదే అన్నాను అతనితో.

"ఏమో మరి! ఆమె కళ్లకి వాడొక మన్మథుడిలా కనిపిస్తున్నాడేమో మరి!" అన్నాడు రాజేంద్ర.

అదెలా సాధ్యం? దృష్టిలోపం ఏమైనా ఉంటే బొత్తిగా కనిపించకపోవడం జరుగుతుంది కానీ, ఇలా వికారంగా ఉన్నవాళ్లు రూపు మారిపోయి అందంగా కనిపించడం జరగదు కదా!

అదే అంటే, రాజేంద్ర నవ్వేసి ఊరుకున్నాడు.

కానీ నేను మాత్రం దాన్నంత తేలిగ్గా తీసుకోలేకపోయాను.

రాజేంద్ర నా రూమ్ నుండి వెళ్లిపోయాక కూడా నా మనసునిండా అవే ఆలోచనలు.

గొప్ప అందగాణ్ణి కాకపోయినా, నేను కాస్తో కూస్తో బాగానే ఉంటాను. పైగా బోలెడంత ఆస్తిపరుణ్ణి. అలాంటి నన్నే, ఎన్నెన్నో ప్రయత్నాలు చేసినా కూడా ఏ ఆడదీ ప్రేమించలేదింతవరకూ.

శ్రావణికి లవ్ లెటరిస్తే చింపి పోగులు పెట్టింది.

నిర్మలతో ఐ లవ్ యూ అంటే చెంప పగలగొట్టింది.

చివరికి ఏమంత బావుండని పిలకజడల ప్రసూన కూడా ప్రేమ మాట ఎత్తగానే ఛీ కొట్టిపారేసింది.

అలాంటిది... అలాంటిది.... అవంతిలాంటి అందగత్తె ఉపేంద్రని ప్రేమించడం ఏమిటి?

ఆ మాట ఉపేంద్రని అడిగేస్తే పోలా?

అలా అనిపించాక అప్పటికి ఒకింత స్థిమితపడగలిగాను.

మర్నాడు ఉపేంద్రని ఒంటరిగా దొరకబుచ్చుకుని నిజంగానే అడిగేశాను.

"నువ్వూ, అవంతీ ప్రేమించుకుంటున్నారటగా? నిజమేనా!"

ఉపేంద్ర ఒకింత బిడియంగా నవ్వి, "నిజమే!" అంటూ తల దించుకున్నాడు.

"ఆడపిల్లలా సిగ్గుపడతావేమిటోయ్! కంగ్రాట్యులేషన్స్!" అంటూ అతన్నభినందించి, ఆ మీదట కుతూహలంగా అడిగాను

"అద్సరేగానీ గురూ! ఎలా లాగావ్ ఆమెను ముగ్గులోకి?"

"ఎలా ఏముందీ? అందరూ ఎలా ప్రేమిస్తారో నేనూ అలాగే ప్రేమించాను!" అన్నాడు ఉపేంద్ర అదేదో చాలా సింపుల్ విషయమైనట్టు.

"నీలాంటి కురూపిని, అవంతిలాంటి అందగత్తె ఎలా ప్రేమించిందీ?" అని నేరుగా అడగటం సాధ్యం కాదు కదా?

అందుకే నే నొక వెర్రి నవ్వు నవ్వి, ఆ మీదట డొంక తిరుగుడుగా అడిగాను "నీ సంగతి సరే! ఆమె... ఆమె నిన్నెలా ప్రేమించిందీ?"

"అదేం ప్రశ్న? నా కామె నచ్చింది, ఆమెకు

నేను నచ్చాను. ఒకర్నొకరం ప్రేమించుకుంటున్నాం. దట్సాల్!" అన్నాడు ఉపేంద్ర.

"ఆమె ఎవరికైనా నచ్చుతుంది. అందులో వింతేం లేదు కానీ, ఆమెకు నువ్వు నచ్చడం ఏమిటి?" ఇది కూడా అడగజాలని ప్రశ్నే కాబట్టి అడగలేకపోయాను.

"ఒకరినొకరు నచ్చితేనే ప్రేమించుకుంటార్లే! ఆ సంగతి నాకూ తెలుసు. కానీ ఆమె నాకర్షించడానికి నువ్వు చేసిన ప్రయత్నాలేమిటి? అది చెప్పు!" అన్నాను మళ్లీ డొంకతిరుగుడుగా.

"ఆమె నాకర్షించడానికి నేను ప్రత్యేకించి ప్రయత్నాలంటూ ఏమీ చెయ్యలేదు. ఆమె అందం ఎప్పట్నుంచో నన్నాకర్షిస్తూ వచ్చింది. ఒకరోజదే విషయం ఆమెతో చెప్పి, మీకు అభ్యంతరం లేకపోతే నేను మిమ్మల్ని పెళ్లి చేసుకుంటాను, అవంతిగారూ! అని ధైర్యంగా చెప్పేశాను. ఆమె వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. దట్సాల్!" అనేశాడు ఉపేంద్ర సింపుల్‌గా.

అతని మాటలు నాకు నమ్మబుల్‌గా అనిపించలేదు. పైగా, తలతో అతని పొట్టలో కుమ్మబుల్‌గా అనిపించాయి.

అంత సింపుల్‌గా ఎలా ఒప్పేసుకుంటుంది? ఏదో దాస్తున్నాడు... కానీ అతన్నింకా రొక్కించడం ఇష్టం లేక అంతటితో వదిలేశాను.

"ఎనీ వే, ఐ యామ్ వెరీ హేపీ! ఇంతకీ పెళ్లెప్పుడు?" అనడిగాను తెచ్చికోలు సంతోషాన్ని ముఖంమీద పులుముకుంటూ.

"ఇదుగో, ఈ డిగ్రీ పూర్తవ్వగానే చేసుకుందాం అనుకుంటున్నాం!" అన్నాడు ఉపేంద్ర.

మేం చదువుతున్నది డిగ్రీ ఫైనలియరు.

"అంటే వచ్చే సమ్మర్‌లోనే అన్నమాట!" అన్నాను నోరు వెళ్లబెడుతూ.

"అవును!" అంటూ నవ్వేశాడు ఉపేంద్ర.

000 000 000

ఆ రాత్రి చాలాసేపటిదాకా నాకు నిద్రపట్టలేదు.

అసలు అవంతి గురించి నే నెందుకింతగా ఆలోచిస్తున్నానంటే...

ఎవర్నో ఒకర్ని ప్రేమించాలన్న ఆరాటంలో ఉన్న నేను ఒకసారి అవంతి కిద్దామని ఓ లవ్ లెటర్ రాశాను.

రాశానన్న మాటేగానీ, తీరా ఇవ్వబోయేసరికి భయం నన్ను అడ్డుకుంది. శ్రావణి, నిర్మల, ప్రసూన వీళ్లద్వారా ఎదురైన చేదు అనుభవాలు గుర్తుకొచ్చి రాసిన ఉత్తరాన్ని రాసినట్టే చింపేశాను. అవంతితో పోలిస్తే వీళ్లు ముగ్గురూ ఏమంత అందగత్తెలు కాదు. అలాంటిది వాళ్లే నా ప్రేమను తిరస్కరించారంటే, ఇంక అవంతెలా యాక్సెప్ట్ చేస్తుందన్న నిరాశ నన్ను మిన్నకుండిపోయేలా చేసింది.

అలాంటిది ఉపేంద్ర ... నాతో పోలిస్తే సూర్యుడి ముందు దివిటీలాంటి ఉపేంద్ర అవంతిలాంటి అందగత్తె ప్రేమను అంత అవలీలగా ఎలా పొందగలిగాడు?

అవంతిని అతనేం మాయ చేసుంటాడు?

ఆ ప్రశ్న నా మెదణ్ణి పురుగులా తొలిచేయసాగింది.

చివరికి ఏమైతే అయిందిలెమ్మని ఆ మర్నాడు అవంతినే నేరుగా అడిగేశాను ఆ విషయం "మీరు, ఉపేంద్రా పెళ్లి చేసుకోబోతున్నారటగా? నిజమేనా?" అని.

"ఏం, చేసుకోకూడదా?" అంటూ నవ్వింది అవంతి.

"కూడదని కాదు గానీ, నా కొక సందేహం!" అన్నాను నేను. ఎలాగైనా సరే కారణం తెలుసుకుతీరాలన్న కుతూహలం నన్ను తెగించేసేలా చేసింది.

"అడగండి!" అంది అవంతి.

"ఏం లేదు... ఉపేంద్ర ఏమంత బాగుండడు కదా! మీరతన్ని ఎలా ప్రేమించగలిగారా అని!"

"నిజం చెప్పమంటారా, అబద్ధం చెప్పమంటారా?" నవ్వుతూ అడిగింది అవంతి.

"నిజమే చెప్పండి!" అన్నాను ఆమెకేసి కుతూహలంగా చూస్తూ.

"అవసరం నన్ను ఉపేంద్రగార్ని ప్రేమించేలా చేసింది."

"అవసరమా...?"

"అవును, సురేష్‌గారూ! మేం చాలా పేదవాళ్లం. మా నాన్న ఒక అటెండరు. మేం అయిదుగురు ఆడపిల్లలం. నేను పెద్దదాన్ని. ఏదో స్కాలర్‌షిప్ వస్తోంది కాబట్టి చదువంటే చదివించగలుగుతున్నాడు గానీ, మా నాన్న కట్నం ఇచ్చి నాకుగానీ, మా చెల్లెళ్లకి గానీ పెళ్లిళ్లు చెయ్యగలిగే స్థితిలో లేదు. అలాంటి నన్ను ప్రేమిస్తున్నానంటూ ముందుకొచ్చారు ఉపేంద్రగారు. మా నాన్నకట్నం ఇచ్చుకోలేడని చెప్పాను. అయినా ఫర్వాలేదన్నారు. ఆయన సిన్సియారిటీ నాకు బాగా నచ్చింది. ఇంక ఆయన్ని ప్రేమించటానికి నాకు అభ్యంతరం ఏముంటుంది?"

'అంటే ... ప్రేమిస్తున్నానంటూ ఎవరు ముందుకొచ్చినా అవంతి అంగీకరించి ఉండేదా?'

ఎర్లీ బర్డ్‌ని కాలేకపోయినందుకు విచారించడం తప్ప నేను చెయ్యగలిగింది ఏముంది?

■




ఇది మీకు జీవితకాలపు బహుమానం!

భారతదేశం ఈ ప్రపంచానికి ఓ ఆధ్యాత్మికదిక్సూచి

భౌతికంగా ఆర్థికంగా విదేశాలు అత్యున్నతస్థితిలో వుండొచ్చుగాక! కాని వారి ఆఖరి మజిలీ మన భారతావని!! ఇది నేటి వాస్తవం. వేదాలూ ఉపనిషత్తులూ ఉద్భవించిన భూమి ఇది. మనిషి గమ్యాన్నీ గమనాన్నీ నిర్దేశించే సూచికలు అవి. ఇవి కొందరికే పరిమితం కాదు. వాటిని అందరికీ అందించే సంకల్పంతో అక్షరవాచస్పతి డాక్టర్ దాశరథి రంగాచార్య తేటతెలుగులో నాలుగువేదాలనూ అందించి చరిత్ర సృష్టించారు. అదే ఒరవడిలో ఇప్పుడు ఆంధ్రపాఠకుల కోసం ఆయన ఉపనిషత్తుల సారాంశాన్నీ 'ఉపనిషత్ అమృతం' పేరిట ఆబాలగోపాలానికీ అర్థమయ్యే రీతిలో అందిస్తున్నారు. మీరు చదవండి, పదిమందికీ ఈ వార్త చెప్పి చదివించండి! ఓ మంచి పనికి మాటను అందించి మనవైన ఉపనిషత్తులలోని అమృతాన్ని మీరు గ్రోలి పదిమందికీ అందించండి. ఇది మీరు చేసే మానవ సేవ మాధవ సేవ...!

త్వరలోనే ప్రారంభం!